22 ఏళ్లకే డాక్టరేట్.. నైనా జైశ్వాల్ రికార్డు


ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న నైనా జైశ్వాల్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 22 ఏళ్ల వయస్సులో డాక్టరేట్ అందుకున్న తొలి భారతీయురాలిగా నగరంలోని కాచిగూడకు చెందిన, టేబుల్ టెన్నిస్ అంతర్జాతీయ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ రికార్డు నెలకొల్పారు. మైక్రో ఫైనాన్స్ ఇన్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై పరిశోధనలు చేసినందుకుగాను నైనా జైశ్వాల్ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గల ఆదినన్నయ్య యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నైనా జైశ్వాల్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. చిన్న వయస్సులో పీహెచ్‌డీ పూర్తి చేయడం, గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా తీసుకోవడం సంతోషంగా ఉందని నైనా జైశ్వాల్ అన్నారు.


పద్మశ్రీ ఉమామహేశ్వరి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

పద్మశ్రీ ఉమామహేశ్వరికి ఘన సత్కారం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంస్కృతంలో హరికథ చెప్పగలిగే ఒకే ఒక్క భాగవతారిణి దాలిపర్తి ఉమా మహేశ్వరిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం ప్రణవ్ కూచిపూడి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు ప్రకటిత భాగవతారిణి డి.ఉమామహేశ్వరికి అభినందన సత్కారం చేశారు. పలువురు నృత్య కళాకారులు పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా బుర్రా వెంకటేశం హాజరై మాట్లాడారు. హరికథకు తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.పద్మజారెడ్డి, కళాకృష్ణ, డా.పసుమర్తి రామలింగశాస్త్రి, డా.కోట్ల హనుమంతరావు, డా.భాగవతుల సేతూరామ్, డా.వనజా ఉదయ్, రమాదేవి, అంజుబాబు, డా.మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.


పురస్కారగ్రహీతల్ని సత్కరిస్తున్న అతిథులు

'అక్కినేని' పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సినీ జీవితంలోనే కాకుండా నిజ జీవితంలో కూడా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు అని ఏపీ పాఠశాల నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువ కళావాహిని ఆధ్వర్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అభినయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వి.నారాయణ రావు, ఆర్.ప్రసన్నరాణి, జెన్నిలకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ రామలింగేశ్వరరావు పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సారిపల్లి కొండలరావు, కె.వి.కృష్ణ కుమారి, రామసత్యనారాయణ, ఎస్.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించండి!

- హైకోర్టులో బీజేపీ కార్పొరేటర్ పిటిషన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. పాలకమండలి ఎన్నికై మూడేళ్లు కావస్తోందని.. ఇప్పటి వరకు 30 గంటలు కూడా ప్రజాసమస్యలపై చర్చ జరగలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏడు సమావేశాలు మాత్రమే జరిగాయని, ఎజెండా, సభ్యుల ప్రశ్నలపై పూర్తిస్థాయి చర్చ జరిగిన దాఖలాలు లేవన్నారు. ప్రజాస్వామ్య దేశంలో చట్టసభలు కోర్టు ఆదేశాల ద్వారా నడపాల్సి రావడం దౌర్భాగ్యమని ఆయన పేర్కొన్నారు.

పైసలివ్వక ఆగిన పనులు..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. అయితే, ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు పూర్తి కాకపోవడానికి నిర్దిష్ట కారణాలను రైల్వే అధికారులు నూతన ప్రభుత్వం దృష్టికి ఇంకా తీసుకుపోలేదని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా అందితే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తవుతాయని రైల్వే అధికారులు అనధికారికంగా స్పష్టం చేస్తున్నారు.

యాదాద్రి ప్రతిపాదనలకు బ్రేక్

ఎంఎంటీఎస్ రెండోదశలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతో పాటు యాదాద్రి వరకు పొడిగింపు విషయమై ఓకే చెప్పకపోవడంతో పనులకు బ్రేక్ పడినట్టు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలకు రైల్వే శాఖ ఆమోదం తెలుపుతూ ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ రెండో దశను పొడిగించడానికి అంగీకరించింది. మొదట్లో రూ.350 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఆ తర్వాత అంచనా వ్యయం పెరిగింది. ప్రాజెక్టులో భాగంగా ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు కొత్తగా నిర్మించవలసిన స్టేషన్లు, ఇప్పటికే ఉన్న స్టేషన్లను అభివృద్ధి చేయడం, ట్రాక్ నిర్మాణం తదితర పనుల కోసం రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే, ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వక అంగీకారం రాలేదని తెలిసింది. దాంతో ప్రస్తుతానికి ఈ ప్రతిపాదలకు బ్రేక్ పడినట్టు సాక్షాత్తూ రైల్వే జీఎం వెల్లడించారు.

సివరేజీ నిర్వహణ బంద్

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలో మరో రెండు నెలల పాటు కొనసాగించారు. నవంబర్, డిసెంబర్, జనవరి నెలకు వాహనాల బిల్లులను పెండింగ్ పెడుతూ అధికారులు వచ్చారు. సంస్థలో ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా వాయిదా వేస్తూ వచ్చారు.

కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారమే చెల్లించాలి..

దళితబంధు పథకంలో భాగంగా మూడు నెలల క్రితం 160 వరకు సిల్ట్ కార్టింగ్ (పూడికతీత వ్యర్థాల రవాణా) వాహనాలను ప్రవేశ పెట్టారు. దీంతో ఒక్కో జెట్టింగ్, మినీ ఎయిర్ టెక్ వాహనానికి రూ.40వేలు తగ్గిస్తామని, పూడిక తీత వ్యర్థాల రవాణా చేయొద్దని వాటర్ బోర్డు అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో జరిగిన చర్చల్లో 2010లో జరిగిన ఒప్పంద ప్రకారమే బిల్లులు ఇస్తామని జలమండలి, కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బిల్లులు చెల్లించాలని సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే వారు వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. బిల్లులు చెల్లించే వరకూ పూడిక తీత పనులు చేపట్టబోమని, బిల్లులో కోతలు పెడితే కుదరదని సీవర్ క్లీనింగ్ మెషిన్స్ ఓనర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. మొత్తంగా కొన్నిచోట్ల పూడికతీత పనులపై వీరి ప్రభావం పడుతోంది. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు విధుల్లోకి చేరబోమని అసోసియేషన్ నేతలు స్పష్టంగా చెబుతుండగా.. అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఒక్కరోజు సివరేజీ నిర్వహణ సక్రమంగా లేకుంటే రోడ్లు అధ్వానంగా మారతాయి. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు తమ వాహనాలు విధుల్లో చేరవని అసోసియేషన్ నేతలు గౌస్, శ్రీధర్, విజయ్ కుమార్, చింతల రాజలింగం, కల్పన, వేణుగోపాల్, నరేష్ ప్రకటించారు.

పట్నంలో పల్లె జాతర..

- నేటి నుంచి కోనసీమ వాసుల ప్రభల తీర్థం!
- మూడు రోజులపాటు వైభవంగా..
- నలగండ్ల అపర్ణ సరోవర్‌లో ఏర్పాట్లు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో పల్లె జాతర పరిఢవిల్లనుంది. తెలుగు సంప్రదాయం కళకళలాడనుంది. 'పట్నంలో పల్లె జాతర' పేరుతో నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు 'ప్రభల తీర్థం' వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. 2016 సంవత్సరం నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన అపర్ణ సరోవర్ వాసులు భక్తిప్రపత్తులతో ప్రభల తీర్థాన్ని శర్వేశ్వరుడి ఉత్సవంగా నిర్వహించికుంటున్నారు. మహిళలు ఈశ్వరుడికి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించారు. ఈశ్వరుడి ప్రభలను అపర్ణ సరోవర్ వాసులు తమ భుజాలపై ఎత్తుకొని మేలతాళాలు, కోలాటాల మధ్య ఊరేగిస్తారు. చిన్నారులు.. పెద్దలు.. కలిసి పల్లె ఆటలు ఆడతారు. ప్రత్యేకంగా చేనేతకారుల సహాయంతో మగ్గాలపై వస్త్రం, నూలు చక్రంతో నూలు తయారు చేస్తారు. మహా సహస్ర లింగాన్ని సొంతంగా తయారు చేయడం విశేషం. శుక్రవారం మహిళలకు ఆటల పోటీలు, పిల్లలతో పల్లెల సందడి గుర్తు చేయనున్నారు. కొబ్బరి ఆకులతో బొమ్మల తయారీ, గాడి పొయ్యిపై పరమాన్నం తయారు చేస్తారు. శనివారం ఫ్రీస్టైల్ ఎగ్జిబిషన్‌తో పాటు మరిన్ని కార్యక్రమాలు చేపడతారు.


ఆటలతో చిన్నారుల సందడి (ఫైల్)





ఈశ్వరుడి ప్రభను ఊరేగిస్తున్న భక్తులు(ఫైల్)

ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు

- శివాలయంలో శివుడి దగ్గర ధూప హారతి సేవ పూజలు.
- ఊరేగింపు, ఈశ్వరుడి ఫొటోలను ప్రభలకు కట్టి తొలి హారతి ఇచ్చి, మేళతాళాలు, కోలాటల మధ్య ఈశ్వరుడిని భక్తులు తమ భుజాలపై ఊరేగిస్తారు.
- పిల్లలు పౌరాణిక వేషధారణలు ఈ కార్యక్రమానికి వన్నెతెస్తాయి.
- గ్రామీణ వస్తు, కళా ప్రదర్శనలు, సాంప్రదాయ పిండివంటలు, జోయ్ రైడ్స్, వీధి గారడీ - స్ట్రీట్ మ్యాజిక్, సౌత్ ఇండియన్ స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్, ట్రెడిషన్స్ మార్వెల్స్, రాత్రి 8.45 దివ్యమంగళ హారతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మేడ్చల్ మెట్రో పనులను ప్రారంభించండి


నిరసన తెలుపుతున్న మెట్రో మేడ్చల్ సాధన సభ్యులు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని మేడ్చల్, కొంపల్లి, బోయినపల్లి, అల్వాల్, బొల్లారం, తూముకుంట ప్రాంతాల్లో మెట్రోలైన్ పనులను ప్రా రంభించాలని జీడిమెట్ల డివిజన్‌లోని ఎన్‌హెచ్-44 మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మెట్రో మేడ్చల్ సాధన సభ్యులు బ్యానర్ పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సాధన సమితి అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఉత్తర ప్రాంతాల అభివృద్ధికి మొండి చేయి చూపించింది. ప్రస్తుత ప్రభు త్వం రాగానే గత ప్రభుత్వ ప్రణాళికను రద్దుచే స్తూ కొత్త ప్రణాళికను తయారు చేస్తుంటే మేడ్చల్, కొంపల్లి, బోయి నపల్లి, కుత్బుల్లాపూర్, షామీర్‌పేట్, అల్వాల్, బొల్లారం ప్రాంతాల్లో మెట్రో లైన్ వేయకుండా ప్రజలను నిరాశ పరిచిందన్నారు.

మంత్రికి ఆహ్వానం



నిజాంపేట రోడ్డులో సెవెన్‌హిల్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఫెస్టివల్ కమిటీ సభ్యులు గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. టెంపుల్ ఫెస్టివల్ కమిటీ సభ్యులు కొమరనేని లక్ష్మీనారాయణ, సూర్య సత్యనారాయణరాజు, గోగినేని వంశీకృష్ణ, యార్లగడ్డ సుశీల, రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మానందగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

\- హైదర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి)

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు


రిజిస్ట్రార్‌కు శుభకాంక్షలు తెలుపుతున్న ఆచార్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు రిజిస్ట్రార్‌గా ఉన్న మంజూర్‌హుస్సేన్ బుధవారం పదవీవిరమణ చేయడంతో ఆ స్థానంలో వెంకటేశ్వర్‌రావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వీసీ కట్టా నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వెంకటేశ్వర్‌రావుకు పలువురు ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.

అరెస్ట్ చేయకుండా అడ్డుకోండి

- హైకోర్టులో పంజాగుట్ట సీఐ ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్ వద్ద ర్యాష్ డ్రైవింగ్ కేసులో పోలీసులు తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని సస్పెండ్ అయిన పంజాగుట్ట సీఐ దుర్గారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాభవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన వ్యవహారంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు సోహెల్‌ను తప్పించాడని.. దర్యాప్తులో ఉదాసీనంగా వ్యవహరించాడనే ఆరోపణలతో సీఐ దుర్గారావును సస్పెండ్ చేయడంతోపాటు ఈ కేసులో ఏ-11గా చేర్చారు. సోహెల్‌ను తప్పించేందుకు సహాయం చేసిన ఏ-12 (నిజామాబాద్ ఇన్‌స్పెక్టర్) ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారని.. తనను సైతం అరెస్ట్‌కు యత్నిస్తున్నారని తెలిపారు. తనపై పెట్టిన సెక్షన్‌లు ఒక్కటి కూడా తనకు వర్తించవని పేర్కొన్నారు. కేసు సంచలనం కావడంతో నిందితులకు బెయిల్ రాకుండా తీవ్రమైన సెక్షన్‌లు పెట్టారని.. చట్టాన్ని గౌరవించే ప్రభుత్వ ఉద్యోగిగా తాను దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని.. ఈ మేరకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు ఎదుట విచారణకు రానుంది.

'నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేనేత జౌళి శాఖ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కేటీ చారి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ చేనేత, జౌళి శాఖ ఫోరం ఉద్యోగుల తాత్కాలిక రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కేటీ చారి మాట్లాడుతూ నేత కార్మికులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజిత్, రాష్ట్ర జనరల్ సెక్రటరి గోవిందయ్య, మహిళా అధ్యక్షురాలు శ్రావణి, ఉపాధ్యక్షులు సోమిడి ద్వారక్, రాములు, సుధీర్, సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలు సందీప్ జోషి, బిజ్జా వెంకటేశ్వర్లు విజయ్‌కుమార్, ఆసిఫ్, సభ్యులు పాల్గొన్నారు.

తాత్కాలిక బడ్జెట్‌తో కొంత నిరాశే..

కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో అనేక రంగాలకు వ్యూహాత్మకంగా ఎంత ఇవ్వాలో, ఏమివ్వాలో అనుకున్నట్టుగానే అందించింది. ఎన్నికల బడ్జెట్ కాకపోవడంతో ఇది సాధారణ బడ్జెట్‌గానే పరిగణించాలి. కేంద్రంలో లోక్ సభకు సాధారణ ఎన్నికలు ఉన్నా ఏ ఒక్కరికీ మేలు చేయని బడ్జెట్‌గానే చెప్పవచ్చు. ఈ బడ్జెట్‌పై పలువురి అభిప్రాయాలు.

(జోన్ బృందం, ఫిబ్రవరి 1, ఆంధ్రజ్యోతి)

పేద ప్రజల బడ్జెట్ కాదు

బడ్జెట్ పేద ప్రజలకు ఆశాజనకంగా కనిపించడం లేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న వారికి నిరాశనే ఎదురవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిని బడ్జెట్ మాటల గారెడీగానే ఉంది.

\- జల్దా లక్ష్మీనాథ్, స్వామి వివేకానంద సంఘం అధ్యక్షుడు

బడ్జెట్ ఆశాజనకంగా లేదు

2024 మధ్యంతర బడ్జెట్ ఆశాజనకంగా లేదు. తొమ్మిది సంవత్సరాలు దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టి, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకే పేదలకు సంవత్సరానికి రెండు కోట్లు ఇస్తామని చెప్పడం ఆస్యాస్పదంగా ఉంది.

\- కేలుకానీ లక్ష్మణ్, సీపీఎం

ఉద్యోగ, ఉపాధి కల్పనలో నిరాశ

బడ్జెట్ పేద వర్గాలకు ఆశా జనకంగా లేదు. ఎన్నికల ముందు పలు హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైంది. ఉద్యోగాలు, ఉపాధి అమలులో నిరాశ పరిచారు. ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు కాకుండా, కేవలం సంపన్న వర్గాలకే మేలు చేసేలా ఉంది.

\- పొన్నాడ శ్రీనివాస్‌బాబు, ప్రైవేట్ ఉద్యోగి

3 వందల యూనిట్ల ఫ్రీ విద్యుత్ హర్షణీయం

బడ్జెట్‌లో సోలార్ ఎనర్జీ రూటప్ ప్లాన్ ద్వారా దేశంలోని కోటి ఇళ్లకు 3 వందల యూనిట్ల ఫ్రీ విద్యుత్ ఇవ్వడం హర్షణీయం. దీనివల్ల పేదలకు కొంత ఊరట లభిస్తుంది.

\- బి.నాగరాజు అడ్వకేట్

కొంత నిరాశే

బడ్జెట్ మౌలిక రంగాలకు పెద్ద పీట వేసినా.. సార్వత్రిక ఎన్నికల కారణంగా తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెట్టింది. దీంతో ప్రజలు ఆశించిన స్థాయిలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదు. ఈ తాత్కాలిక బడ్జెట్‌తో పథకాల్లో పెద్దగా మార్పులు కనిపించవు. పన్ను రాయితీపై నిరాశ ఉంది. రైల్వేకు పన్ను పెంచడం సంతోషంగా ఉంది.

\- ఎం. సంపత్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగి మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్, మెట్రో మేడ్చల్ సాధన సమితి అధ్యక్షుడు


ఫుడ్‌స్టాల్ వద్ద రోడ్డుపై ప్రజలు

ఆ రూల్స్ కుమారికేనా?

- పోటాపోటీగా ఫుట్‌పాత్‌పై వ్యాపారుల స్టాల్స్
- సీఎం ఆదేశాలతో వెనక్కి తగ్గిన ట్రాఫిక్ పోలీసులు

రాయదుర్గం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కోహినూర్ హోటల్ పక్కన నాలెడ్జ్ సిటీలో కుమారి ఫుడ్‌స్టాల్ యథావిధిగా నడిపించుకోవచ్చని ఓ చిన్న వ్యాపారికి సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలవడం సంచలనంగా మారింది. ఆ ఆదేశాలు ఆమెకేనా.. తమకు వర్తించవా.. అంటూ మరికొందరు ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు మొదలుపెట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో కుమారి ఫుడ్‌స్టాల్‌కు పోలీసులు మంగళవారం జరిమానా విధించి, వ్యాన్‌ను అక్కడి నుంచి తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ అవ్వడంతో స్పందించిన సీఎం ఆమె యథాస్థానంలో వ్యాపారం కొనసాగించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వెనక్కి తగ్గారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అదునుగా చేసుకుని తామూ పేదలమే అంటూ మరికొందరు ఫుట్‌పాత్‌పై వ్యాపారం మొదలుపెట్టారు. సుమారు 20 ఫుడ్‌స్టాల్స్ ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాయదుర్గం కేబుల్ బ్రిడ్జి నుంచి నాలెడ్జ్‌సిటీ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

క్రీడలతో ఒత్తిడి దూరం : సైబరాబాద్ సీపీ


గౌరవ వందనం స్వీకరిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి నుంచి బయటపడేందుకు క్రీడలు సహకరిస్తాయని, ప్రతి పోలీస్ అధికారి తప్పనిసరిగా ఏదో ఒక క్రీడాంశంలో పాల్గొనాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి అన్నారు. సైబరాబాద్ కమిషనరేట్‌లోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం 6వ వార్షిక పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ను ప్రారంభించారు. ఈసందర్భంగా పోలీస్ క్రీడాకారుల గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్ క్వార్టర్ ఏడీసీపీ షమీర్, డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలనలో ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో శనివారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పా ల్గొనే ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చే యాలన్నారు. గార్డెన్స్‌లో సమావేశ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు.

ఎమ్మెల్యే పర్యటన

అల్లాపూర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్‌లోని పలు కాలనీల్లో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. సఫ్దార్ నగర్ ఈ-బ్లాక్‌లోని వీధిలో లోతట్టు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు పనులు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహ బేగం, వీరారెడ్డి, సయ్యద్ రియాజ్, బాబా, అబ్దుల్ సలీం, షేక్ రఫీక్ పాల్గొన్నారు.

అక్రమ నీటి కనెక్షన్ల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఖైతలాపూర్ ప్రాంతంలో కొనసాగుతున్న అక్రమ నీటి దందాపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'మంజీరా నీటితో అక్రమ దందా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. మంజీరా పైపులైన్ ద్వారా అక్రమ కనెక్షన్లు తీసుకొని, మంజీరా నీటిని నిల్వ చేసి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్న దందాపై వివరాలు సేకరించారు. మంజీరా అక్రమ పైపులైన్లు భూమిలో ఉండడంతో శుక్రవారం సిబ్బంది సహకారంతో తవ్వకాలు చేపట్టి... అక్రమ కనెక్షన్ల భాగోతం వెలికి తీయాలని నిర్ణయించినట్టు జీఎం ప్రభాకర్‌రావు తెలిపారు.

'ఎలక్ట్రికల్ మీటర్‌కు ఫోన్ నంబర్ లింక్ చేసుకోండి'

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ మీటర్‌కు వినియోగదారులు ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ కూకట్‌పల్లి ఏడీఈ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల బిల్లు జనరేట్, డ్యూ డేట్, పేమెంట్ చెల్లించిన వెంటనే ఆ నగదు రిసీవ్ కాగానే మెసేజ్ వస్తుందన్నారు. ఎప్పుడైనా పవర్ కట్ ఉంటే ఆ వివరాలను ముందుగానే సెల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో టీఎస్ సదరన్ పవర్ డాట్.కామ్‌లో ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

బాలానగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లోని వివిధ బస్తీల్లో కాంగ్రెస్ నాయకులు మూడురోజులు పాదయాత్ర చేపట్టి సమస్యలు తెలుసుకున్నారు. వారి దృష్టికి వచ్చిన సమస్యలను జాబితా రూపంలో తయారు చేసి గురువారం బాలానగర్ శోభనా బస్టాపు సమీపంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌కు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పుష్పారెడ్డి, ఏబ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మధూగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో జగదీశ్వర్‌గౌడ్ పర్యటన

వివేకానందనగర్‌కాలనీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ పరిధి బాగ్‌అమీర్ సమీపంలోని శాంతినగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. కాలనీలో గురువారం ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై సమస్యల వివరాలు తెలుసుకున్నారు. నాయకులు కూన సత్యంగౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఏకాంత్‌గౌడ్, నాగమణి, మురళి పాల్గొన్నారు.

నకిలీ సీఐడీల కేసులో సూత్రధారి కోసం వేట

రాయదుర్గం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): నకిలీ సీఐడీ కేసులో సూత్రధారి ఎస్సై కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఏపీ కర్నూలుకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ గతనెల 26న నకిలీ సీఐడీలు ఓసాఫ్ట్‌వేర్ కంపెనీలోకి వెళ్లి నిర్వాకులను బెదిరించి డబ్బులు దోచుకున్నారు. ఈ కేసులో మొత్తం 10మంది నకిలీ సీఐడీ ముఠాలో కీలకపాత్ర పోసించి, సీఐడీ అధికారుల గుర్తింపు కార్డులు తయారు చేసి, కీలకంగా వ్యవహరించిన సబ్‌ఇన్‌స్పెక్టర్ అజయ్‌ను పట్టుకునేందుకు రాయదుర్గం పోలీసులు ప్రత్యేక బృందాలుగా గాలిస్తున్నట్లు సమాచారం. అయితే అజయ్ పోలీసు తెలివితేటలతో సెల్‌ఫోన్ లేకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. త్వరలో అజయ్, కూకట్‌పల్లికి చెందిన మరో నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. నకిలీ సీఐడీ ముఠా నాలుగైదు ఐటీ కంపెనీలపై దాడిచేసి డబ్బులు దోచుకోవాలని పథకం వేసినట్లు సమాచారం. మొదటి ప్రయత్నంలోనే వీరి ఆగడాలను కట్టించడంతో మీగత ఐటీ కంపెనీలు ఏమున్నాయి. ఆయా కంపెనీల బలహీనతలు ఏమిటి అనే అంశాలపై సైతం దృష్టిసారించినట్లు సమాచారం.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయబాల స్వస్థత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా 8,9,10 తరగతి విద్యార్థులకు మేడ్చల్ జిల్లా వైద్య బృందం గురువారం హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చింది. కార్యక్రమంలో వైద్యులు జ్యోతి, సంతోష్, ఫార్మసిస్ట్, సౌంద ర్య, ఏఎన్ఎం సత్తెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

'హరిహర కళాక్షేత్రం' సభ్యుల నియామకానికి నోటిఫికేషన్

ఫతేనగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ కాలనీ హరిహర కళాక్షేత్ర దేవస్థానం ట్రస్టుబోర్డు నూతన సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు టెంపుల్ ఈవో కే అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆశక్తి గల వారు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మబండ పరిధి దత్తత్రయ కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమానాలు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు.కార్యక్రమంలో శంకర్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేష్‌గౌడ్, మురళీకృష్ణ, శ్రీధర్, శేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు, రేపు జేఎన్‌టీయూలో అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఎస్‌పీఈఆర్), జేఎన్‌టీయూ ఫార్మసీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ అండ్ కొలబ్రేషన్ అడ్వాన్సింగ్ హెల్త్ కేర్" అంశంపై శుక్ర, శనివారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ ఇండియా డాక్టర్ రామకృష్ణ హాజరవుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతారెడ్డి తెలిపారు. ఫార్మా రంగంలో ఇప్పటివరకు జరిగిన కృషి, కొత్త ఆవిష్కరణల అవశ్యకతపై విద్యార్థులకు నిపుణులు వివరిస్తారని పేర్కొన్నారు.